డు-ము-వు-లు

ముందు ముందు ఎప్పుడో, భారతం పదిహేను పర్వాలూ తెలుగులోకి వ్రాయబోయే - తిక్కన సోమయాజుల్ని కనబోయే గుంటూరి కొమ్మన్నగారు - నిండు యౌవనం వచ్చీ రావడంతోనే, - తండ్రితో పోట్లాట పెట్టుకున్నాడు!

కారణం ఏమిటంటే - తన గర్భాదానం విషయం!

చేసుకున్నది సయాం మేనమామ కూతుర్నే:

కాని, బంధుత్వం ముదిరిన తరువాత వియ్యాలవారికి, రాకపోకలు కట్టుబడ్డాయి!

కొమ్మన్న తల్లిదండ్రులకు రెండిందాల గునుపుగా ఉంది; తను, ఒక్కతే ఒక్కగా నాడుపడుచై ఉండగా, అన్నగారు వేసీవేయని శ్రీమంతుడై ఉండగా, కొడుకు పెళ్ళితో, లంచాలో లాంఛనాలో సరిగా, తన హోదాకూ అన్నగారి హోదాకూ తగినట్లు ముట్టచెప్పలేదని, ఆ యిల్లాలు సదస్యం నాటినుంచీ, ముఖం ముడుచుకునే ఉన్నది!

ఆయన చూడబోదామా అంటే - అభం శుభం ఎరుగని అమాయకుణ్ణి, తనను మాయచేసి కట్నం కానుకా అంటూ లేకుండా, చెల్లెలిని మెడకు కట్టినట్టుగా - యిప్పుడు కూతుర్ని కూడా అరచేత వైకుంఠం చూపించి తన కొడుక్కు అంటకట్టడం జరిగింది కదా అని, ఆ పెద్దమనిషి అక్కసు.

తానేమో కొమ్ములు తిరిగిన లౌక్యుడని నలుగురిలో పేరు మోసి, ఒకసారికి రెండుసార్లు, యిలా, యిలాంటి స్వల్పవిషయంలో బావమరది చేతిలో దెబ్బతిన్నాను కదా అని, ఆయనకు ఉక్రోషం.

సరే-దానా దీనా, - వారికీ వీరికీ మళ్ళు తోరణం నాటి నుంచి మాటలు లేవు! రాకపోకలు లేవు!

ఆ వంక చుట్టాలు యిటూ, ఈ వంక చుట్టాలు అటూ ఉన్నవారుండకుండా, కలుగచేసుకొని రాయబారాలు సాగించి, వారినీ వీరినీ ఎగసనద్రోయడంతో మరింత కావేషాలు పెరిగిపోయినాయి!

ఇన్నేళ్ళకు తప్పనిసరి కనుక కొమ్మన్న మామగారు వియ్యంకుడికి శుభలేఖ పంపించారు.

ఫలానారోజున నిషేకానికి ముహూర్తం ఏర్పాటు చేశాం!

అది తప్పితే - మళ్ళీ ఒక్క అయనంవరకు ముహూర్తాలు లేవు!

మన గర్వం అహంకారం మనలోనే అణచుకోవడం మంచిది!

మీరు ఆడపిల్లలను కన్నవారైతే - యీ తీరున శఠించి ఉండకపోదురు?

ఇప్పుడన్నా, మీకు యుక్తాయుక్తములు తోచని పక్షంలో పెద్ద లెవరికైనా యీ లేఖ చూపించి, వారు అనతిచ్చిన ప్రకారం ఆచరించవలసింది -

కొమ్మన్నగారి తండ్రి యీ లేఖ, వూళ్ళో పిన పెద్ద లందరికీ చూపించాడు! కొడుక్కిమాత్రం చూపించడం మరిచాడు!

లేఖ చదివినవారందరూ, యధాశక్తి మరో నాలుగు సమిధెలు వేశారు!

ఆడపిల్లను కనుక్కున్నవాడికి, అంత పొగరుమోతుతనమా? అయ్యా బాబూ అని వచ్చి కాళ్ళమీద పడక్కర్లేదా?

తల తిరుగుడుతో, తన కూతురి కాపురానికి శాశ్వతంగా నీళ్ళు తోడుకున్నాడు!

కొమ్మన్నగారి తండ్రి ఊర్లోవారి సలహాలన్నింటినీ శిరసావహించాడు. ఊరంతా లంకాయాగంలాగా ఇదే మాట అయినా, అప్పటికీ కొమ్మన్నకు తెలియలేదు.

అంతమంది పెద్దమనుష్యుల్లో – గురునాథంగారనే ఒక తాతగారు, జ్యోతిషంలో చండప్రచండుడు, అమిత తల తిక్క మనిషి – ఒకరుండేవారు; ఆయన పనిగట్టుకుని కొమ్మన్నను గ్రామదేవత తోపులోకి పిలుచుకువెళ్ళి, ఉన్న కథ యావత్తు చెప్పి, వాళ్ళ నాన్న వైఖరి వివరించి చెప్పి –

ఇదీ కథ. నీ మంచి చెడ్డలు నీవు ఆలోచించుకోవాలిరా – మనవడా అన్నాడు.

– నాన్నకు ఎదురుతిరగమంటావా?

– అది నా చేత చెప్పించాలా?

– చెప్పకుండా వెళతాను –

– ఇలాటి ఆపత్సమయంలో అదే ఉత్తమమని పెద్దలంటారు.

– తండ్రిని తిరస్కరించిన కుమారుడికి ఉత్తమగతులుండవని శాస్త్రాలు ఘోషిస్తున్నాయటగా!

– తప్పుదారి పట్టిన తండ్రికి విధేయుడై, ఆలిని ఉసురుపెట్టేవాడిగతీ అంతేనంటున్నాయి శాస్త్రాలు, నాయనా!

ఒక్క విషయంలో ఆలోచించుకో! పితృవాక్య పరిపాలన చేసి, శ్రీరామచంద్రుడంత ఖ్యాతి గణించడం మేలనుకుంటావా? – ఆ సచ్చిదానంద విగ్రహుడిలాగానే, అమాయకురాలైన యిల్లాలిని పరిత్యజించడం ఉత్తమం. ఆనాడు రాఘవునికి ఆలి ఉసురు తగిలిందా? – లేదు. లేదు తండ్రీ లేదు! ఈ పుణ్యభూమిలో జనించిన తల్లులు, భర్త ఎంతటి ఆతతాయి అయినా అతడిని పల్లెత్తుమాట అనరు. కంటికి కనబడడం కరువైనా హృదయపీఠాన నిలిపి, మనోవాక్కాయ కర్మలనే చతుర్విధోపాయములతో అహరహమూ అర్చన చేస్తూ – అంతటి మహానుభావుడికి సహధర్మచారిణిగా మెలగే భాగ్యం తనకు కొరవడిన హతభాగ్యనని తన్ను తాను నిందించుకుంటూ – ఇలా గడుపుతారయ్యా జీవితశేషం – యీ దేశంలో ఐదువలు! వేయి జన్మలకైనా అతడే పతి కావాలని తపస్సు చేస్తారుకదయ్యా!

కనుక నాయనా, నిర్భయంగా నీవు మీ నాన్నమాట విను! ఆ పిల్లదాని ఉసురు నీకు తగలదు. అంతగా ఒకవేళ తగులుతుందేమోనని రవంత అనుమానం ఉందా, మన స్మృతుల్లో ఒక్కొక్క పాపానికి వందేసి పరిహారాలున్నాయి; మీ నాన్న కలిగినవాడు కనుక నీచేత అన్నీ చేయిస్తాడు – నిన్ను విముక్తుణ్ణి చేస్తాడు.

రేపీపాటికి – తల్లీ తండ్రీలేని పిల్లనుచూసి, తెచ్చి నీకు ముడిపెడతాడు.

తల్లీ తండ్రీ ఉంటే మళ్ళీ తగాయిదా వస్తుందిగా! అందుకని యీసారి ఆ జాగ్రత్తపడతాడు.

లక్షణంగా పెళ్ళిచేసుకుని ఒక్క కొడుకును కంటివా నీవు తరిస్తావు - ఏడేడుతరాలవారూ తరిస్తారు.

కొమ్మన్న కళ్ళవెంట కడవలాది నీళ్ళు కారుతున్నాయి. తాతగారి కాళ్ళు పట్టుకున్నాడు. గురునాథంగారు చిన్నవాడి కళ్ళనీళ్ళు తుడిచి, వెర్రికుంకా వెళ్ళిరారా అన్నాడు!

కొమ్మన్న కట్టుబట్టలతోనే మళ్ళీ ఊరు మొగం చూడకుండా అటునుంచి అట్టే బయలుదేరి పోయినాడు.

దారిలో ఊరి పొలిమేరల వాళ్ళ చేనుగట్టున చెరువు పక్కన తండ్రి సంధ్యావందనం చేసుకుంటున్నాడు! కొమ్మన్న ఎదుటపడక తప్పిందికాదు. ఆయన 'ఎక్కడికి?' అని అడిగితే నిజం చెప్పక తప్పిందికాదు.

తండ్రి వద్దనలేదు. 'నా కొడుకు అత్తవారింట ఊడిగం చేసుకొని పొట్ట గడుపుకునే నిర్భాగ్యుడని అనుకోలేదు' అంటూ సంధ్యావందనంలో కలిపి సణుక్కున్నాడు.

- అంటే నీ అభిప్రాయం - నేను మళ్ళీ యింటికి రాకూడదనా?

- మానాభిమానాలు లేనివాడు, మా సీమలో మళ్ళీ అడుగుపెట్టడమే--

కొమ్మన్న నవ్వుకుంటూ వెళ్ళిపోయినాడు. తండ్రి, అలా కళ్ళప్పగించి చూస్తూ నిలువబడిపోయాడు.

వెళ్ళగా వెళ్ళగా ఏరు అడ్డంవచ్చింది! ఎక్కడో వానకురుస్తున్నట్టు ఉద్దండంగా హోరు వినబడుతూంది. చినుకు గాలివాటాన ఏటవాలుగా సూదల్లే గుచ్చుకుంటోంది.

మసక, ఈదురు; ఒళ్ళు పులకరింతగా ఉంది.

ఏటిమీద కంపా గట్రా కొట్టుకు వస్తూంది - అలమీద నురుగుంది, నీటికి ముదురురంగు తేలుతూంది - వెల్లువవచ్చే సూచనలు అవన్నీ -

కనుచూపుమేర ఎక్కడా తిప్పలేదు. కొమ్మన్న యజ్ఞోపవీతం నడుముకు చుట్టుకుని, పై అంగవస్త్రం కాసెబిగించి, ఏటిలోకి ఉరికి చాలున కొంతదూరం దిగువకు తేలుకుంటూ పోయి, అడ్డం తిరిగాడు.

వాన కొండంత చినుకుగా కురుస్తూంది - కారు చీకటి - వరద పొంగింది - గట్టు కనబడటంలేదు - కొమ్మన్నపని మునగానాం - తేలానాంగా ఉంది.

పైనుంచి బానలు కొట్టుకొస్తున్నాయ్. ఓ నడిబాన చేతికందింది - సునాయాసంగా మెట్టపట్టాడు కొమ్మన్న.

అల్లంత దూరాన ఏదో నెగడి రగులుతూంది - అక్కటికి చేరుకున్నాడు చిన్నవాడు. తామరపువ్వువంటి పిల్ల, తడిబట్టలతో, చలికాచుకుంటూ కూర్చుంది.

కొమ్మన్న పిల్లకు ఎదురుగా కూలబడ్డాడు.

- వోరా మడిసి?

బ్రాహ్మలం!

అయితే దండమెడుతా!

పిల్ల లేచి నిలుచుంది.

కొట్టుకొచ్చారా అయ్యా!

లేదు - బానపట్టు వచ్చాను!

- కొమ్మన్న తనలో తాను నవ్వుకున్నాడు.

ఆ బానలన్నీ మాయే! నెలసరి ఆవం అంతా గంగపాలైంది.

మీరు కుమ్మర్లా!

- పిల్ల కిలాకిలా నవ్వింది -

కుమ్మర్లం కాము దొమ్మర్లం కాము. మా అయ్య కూలికి నాలికీ బానలు ఆరెబోయించి లాభసాటికి అమ్ముకుంటాడు సరేగాని, మరి మీకు బువ్వెట్టా!

చేరువను ఏదీ గ్రామం లేదో!

ఉంది - రెండుకోసుల్లో. కాని ఏడు వాగులడ్డం.- అయన్నీ ఏకమైనాయి - ఎట్టా బోతారయా! ఈ యాళకు యీడనే పస్తుండండి!

పిల్ల కోకచెంగు పొడి ఆరింది.

చెంగుతో కొమ్మన్న తల తుడుస్తూ -

మీరు సదువుకున్న బాపనోరగందా? అని అడిగింది. కొమ్మన్న తల వూగించాడు!

కతలూ కమామీషులు వస్తాయిగంద -

చిక్కని కత ఒక్కటి సెప్పండి -

పిల్ల తగిలేంత దగ్గిరగా కూచుంది.

కొమ్మన్న తన కథే - బేతాళుడు విక్రమార్కుడికి చెప్పినట్లు చెప్పడం ప్రారంభించాడు -

ఆ పిల్లవాడు తండ్రితో ఆ విధంగా పోట్లాడి, అత్తవారింటికి వెళుతూంటే ఏరడ్డం వచ్చింది. ఏరు ఎల్లాగో దాటాడనుకో - అక్కడ ఓ పిల్ల అడ్డం వచ్చింది.

ఆ పిల్ల ఎల్లా ఉందనుకున్నావ్ - బంగారపు బొమ్మ. పిల్లవాడి మనసు ఆ పిల్లదానిమీదే ఉంది. వెళ్ళలేడు. చూస్తూ ఉండలేడు. అలాటి సమయంలో వాడు ఏం చేయాలి మహారాజా అని బేతాళుడు అడిగాడు. విక్రమార్కుడు ఏం జవాబు చెప్పాలో తోచక మౌనంగా ఉన్నాడు.

పిల్ల ముక్కుమీద వేలేసుకుంది.

ఏం చోద్దెమయ్యా! మా రాజు మాటకేంగాని, ఒక్కముక్క యిడమరచి సెప్పండి. ఆ పిల్లగాడు సక్కనోడే గంద?

ఆహాఁ -

అయితే పిల్ల మనసుపడలా?

చెప్పలేం! - వాడు పెళ్ళయినవాడు గదా?

అయితేమట్టుకు - అదేం ఆడకూతురయ్యా.

ఒంటరిగా సిక్కారంటివి - యిద్దరూ సక్కనోళ్ళంటివి. వోనంటివి - వొంగుడంటివి. మనసుపడక ఎట్టా ఉందయ్యా - ఆరిద్దరూ బాపన్నోరన్నమాట! మనసు దాచుకోడం ఆ మా రాజులకే సేతనౌ -

కొమ్మన్న నిర్భయంగా తలఎత్తి చూచాడు పిల్లవంక.

వాడికి మనసుంది కాని, పిల్లది ఏమనుకుంటుందో అని భయం!

పిల్ల విరగబడి నవ్వి - కొమ్మన్న చెంపలు దువ్వి, ఆ అయ్య నీవంటోడే ననుకుందామా అంది.

కొమ్మన్న చేతులు చేతులోకి తీసుకున్నాడు, పైన ఫెళ్ళున నక్షత్రాలు వచ్చినాయి.

తెల్లవారింది. ఎండ కళ్ళమీదికి వచ్చింది. కాని, కొమ్మన్నకు మెలుకువరాలేదు. కాని ఎందుకో ఉలిక్కిపడి లేచాడు, పిల్ల కాళ్ళకు మొక్కుతూంది.

అదేమిటి? -

నేను చేసుకున్న పున్నెం!

- కొమ్మన్న తెల్లబోయినాడు.

స్నానము అనుష్ఠానమూ తీర్చుకుని తిరిగివచ్చాడు. పిల్లదాని పక్కను కూర్చున్నాడు.

- నా పేరు కొమ్మన్న. మా వూరు -

పేరుకీ వూరుకీ ఆసపడ్డాననుకుంటివా - భగవంతుడిట్టా వచ్చాడనుకున్నా -

నన్నేలుకున్నాడనుకున్నా -

మీ అయ్య ఎక్కడున్నాడు?

- ఈదురులో, అలమంద తలకొక దిక్కుగా సెదిరిపోయె - మళ్ళేసుకు రావాలిగంద!

రాగానే చెప్పి, నిన్ను వెంట తీసుకుపోతాను.

ఏడకు?

మా ఊరికి! నిన్నూ ఒక భార్యగా చూసుకుంటాను.

పిల్ల ఉన్నట్టుండి పకాలుమంది.

- అది నీవల్లకాదయ్యోవ్! నేనీ గడ్డ యిడిసి రానుగంద!

రాక! నామీద మక్కువలేదా!

లేదో! - అయబ్బ! లేదంటే దబ్బర కాదో! ఉన్న మక్కువంతా ఒక్క ముచ్చటలో తీరిందిగదయ్య! మాకు అరటిచెట్టు కులదేవత - ఒక్కటే పున్నమి - ఒక్కటే పూత - మనబిడ్డకు ఏం పేరెట్టుకోను!

- కొడుకైతే గురునాధుడు! ఆడపిల్లైతే -

- నీ కంటపడదుగా! అల్లదుగో - ఆనవాలుకు ఆ సేతి ఉంగరం యిచ్చుకో! పుట్టే బిడ్డకు ఆ పేరెట్టి, బుద్ధులు సెప్పి - నూగుమీసం రాంగానే ఆనవాలిచ్చి, నీకాడకంపుతా! అలించి పాలించి అక్కరకు దెచ్చుకో!

కొమ్మన్న, పిల్ల రెండుచేతులూ పట్టుకొని బ్రతిమాలు కున్నాడు.

నిన్ను విడిచి ఉండలేనన్నాడు: పిల్ల పెదవి విరిచింది!

నన్నేలినోడు యింత నరంలేని మడిసి అనుకోలేదు. మనసేత నేముందయ్యా! అది మన మొగాన రాత: యిడిసి నిలవలేవా?

రేతిరి ముచ్చటంతా - కలనుకో!

మడిసీ, యీ ఆడకూతురుఅలవి తప్పలేదు - అన తప్పలేదు. నిన్ననే తల కడుక్కుని శుద్ధిగా కులదేవతకు మొక్కులిచ్చినా! ఆ తల్లి వరదల్లే పొంగి నిన్నీడకు తెచ్చింది! ఆ యమ్మను తలచుకొని, నన్నిచ్చుకున్నా - పుట్టక సెల్లింది.

మారుమాట అనకయ్యా! తలచుకుని నడచిపో – సేతనైతే మరచిపో– లేదా కంట తడిపెట్టకుండా తలచుకో! పోయిరావయ్యా – నీ బతుకు నీవు బతకవయ్యా–

పోనీ నీ పేరన్నా చెప్పవూ?

ఏరునడుగు – అది చెపుతుంది!

– పిల్ల ఒక్క అడుగు ముందుకువేసింది – కొమ్మన్నకు పట్టరాని దుఃఖము వచ్చింది. పిల్ల ఆగిపోయి, కొమ్మన్న తల చెక్కిలికి ఆనించుకుంది.

– ఈ దుఃఖం బిడ్డమొగం చూసేదాకా ఉంటుంది – నేను ఓదార్చలేను! మన ముచ్చట భారతం అనుకో – నీవు అర్జునుడివనుకో – నేను ఆ నాగుల పిల్లనుకో. ఈ మమత యిక్కడే మరచిపోవయ్యా! నన్ను చూసిన కంటే నీ అలిని చూచుకోవయ్యా!

పిల్ల, తెలిమీనల్లే ఏటిలోకి ఉరికి మాయమైంది.

కొమ్మన్న అత్తవారి ఊరువెళ్ళి, అక్కడే ఉండిపోయినాడు:

మనవడు పుట్టాడని కబురు విని, కొమ్మన్న తండ్రి ఊళ్ళో వాళ్ళందరిచేతా చెప్పించుకొని పసివాడిని చూడటానికి వెళ్ళాడు. వీడి పుట్టుకతో అందరి తిక్కా కుదిరి మళ్ళీ ఏకం అయినందుకు గుర్తుగా, పిల్లవాడికి తిక్కన అని నామకరణం చేయడం జరిగింది.

తిక్కన పెరిగి పెద్దవాడైనాడు – సోమయాజి అయినాడు. భారతం ముందువేసుకుని తెలిగింపుకు తలపడినాడు.

కొమ్మన్నకు బాగా వార్ధక్యంవచ్చింది కాని, కనుపటిమ వాక్పటిమ తగ్గలేదు.

తగ్గకపోగా, కొడుకు మనుమసిద్ధి ప్రాపకంలో అంత ప్రయోజకుడు కావటం – కాకతి గణపతి దేవుడంతటి వేత్త ఆంధ్ర భారతాన్ని ఎప్పటికప్పుడు తెప్పించుకుని కళ్ళకద్దుకుంటూ బహుమానాలు పంపుతూండటం – యీ వైభవంలో మెలగుతూండటంవల్ల ముసలి ఆయనలో ఎక్కడలేని రీవీ రాజసం ఉట్టిపడుతూంది.

వందిమాగధులందరూ పరివేష్టించి ఉండగా – ఒకనాడు కొమ్మన్నగారు కొలువుదీరి కూర్చున్నాడు.

అప్పుడు – గురునాథుడు వచ్చాడు.

వచ్చి – కొమ్మన్నకు నమస్కరించి ఓసరిలి నిలుచున్నాడు.

ఎవరు నీవు –

దర్శనానికి వచ్చాను.

అబ్బాయిగారు ఏకాగ్రతతో గ్రంథ రచన చేసుకుంటున్నారు – దర్శనానికి వలనుపడదు.

చిత్తం – నేను వచ్చింది తమ దర్శనానికి –

ఏమిటి విశేషం –

ఏకాంతంగా మనవి చేసుకుంటాను.

సరే – భోజనానంతరం దర్శనం చేసుకో!

గురునాథుడు నమస్కారంచేస్తూ అక్కడే కూర్చున్నాడు.

నీ భోజనమెక్కడ –

ఎక్కడ ప్రాప్తమో అక్కడ -

- 'ఎవరీ తుంటరి?' అన్న చూపు చూశాడు కొమ్మన్న: గురునాధుడు - మారుమాట చెప్పకుండా రొండి నున్న ఉంగరం దోసిట పట్టాడు.

కొమ్మన్న కంపించిపోయాడు. చుట్టూ వున్నవారందరూ దిగ్భ్రాంతులైనారు.

అందరికీ సెలవిచ్చి పంపి, కొమ్మన్నగారు 'గురునాధా!' అని కేకపెట్టి కుమారుణ్ణి కౌగిలించుకున్నారు.

'అయ్యా! అయ్యవే! మా అయ్యవే!

మాయమ్మ సెప్పిన కనుముక్కు తీరే -'

మీ అమ్మ బాగుందా!

బాగుంటే అడనే ఉండకపోయినా! నిన్ను తలచుకుంటూ నన్ను చూసుకుంటూ ఆ యవ్వ పండల్లే బతికింది! మన కథంతా చెప్పింది! అప్పుడే నిన్ను చూడపోతానంటే యిడవలేక గొల్లుమంది. మొన్న ఏకాదశి రాంగానే కన్నుమూసిందయ్యా!

కొమ్మన్న పసివాడిలాగా బావురుమన్నాడు.

మీ తల్లి గొప్ప యిల్లాలు నాయనా! అంటూ తలనిమిరాడు.

గురునాధుడు మబ్బువిడిచిన యెండల్లే నవ్వాడు.

మా యవ్వ గొప్పలు నాకాడ చెప్పాతుండవా అయ్య! సరేగాని, నాకో సిట్టితమ్ముడుండాడంట -

కొమ్ముర్దిరిగినోడంట - కంట సూద్దునా -

కొమ్మన్న కొంచెం తటపటాయించాడు.

నాయనా! విద్యాబుద్ధులు నేర్చి ప్రయోజకుడివి కావలసిన వాడివి - యిలా ఉన్నావా ఆఖరికి స్వచ్ఛంగా మాటలాడటమన్నా రాకుండా, ఇదంతా నా స్వార్థమే, నా అపరాధమే!

ఇంతలో తిక్కన సోమయాజిగారు అక్కడకు దయచేశారు. 'పలపలని మూకలో *కాల్నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకుగదా, కలితభుజుడగుచు నొక్కడు, తొలగి* చనియె నేమి చెప్పుడు' - అని మనసులో బిగ్గరగా పద్యం తడుముకుంటూ -

వచ్చేవారిని చూసి, గురునాధుడు లేవబోయాడు. కొమ్మన్నగారు 'గురునాధా!' అన్నారు: ఆపారు.

సోమయాజిగారు, ఎగిరి గంతేసినంత సంతోషంతో - 'పద్యం పూర్తి అయింది నాయనగారూ, మీ ముఖం చూడగానే' అంటూ ఆగి, 'యీతడెవ్వరు' అని పృచ్ఛించినాడు.

'కవిబ్రాహ్మలని పేరు మోశారు గందా - ఆమాత్రం యెరికలేదా? అయ్యగోరి పక్కనట్టా కూకుండవయ్యా! ఒక్కపరి చూస్తా!'

తిక్కనగారికి కోపం ముంచుకొచ్చింది!

"ఎవ్వరీతడు - ఏమిటి పాడు భాష?"

గాలికి పుట్టి, ధూళికి పెరిగినోళ్ళు కూసేదయ్యా - యీబాస, తాటాకుల కట్టలు మేసేవోళ్ళకు మీ బాస.

అయ్యా! నాకన్న చిన్నోరు దణ్ణమెట్టరాదు. అయ్యగోరికి మొక్కి నా మనసు విప్పుకుంటా –

యీబాస, తవురిబాస నేనూ సదివినా – అకాడ అకాడ అనిమాసినా – సుక్కలనీడ బతికేవోళ్ళందరూ సోద్దెంగా సూసినారు. పొలంలో వోళ్ళు-పుట్రలో వోళ్ళు – యీడికి యెర్రెక్కిందన్నారు. మరీ గిట్టనోళ్ళు యీడు బ్రామ్మడైనాడన్నారు. ఛస్ – కూడదనుకొని యిడిసినా, ఆడూ యీడూ పలికే పలుకునే పాటకట్టినా – పదంకట్టినా – పదం పాటా చేలో ఆవులన్నీ ఆలకిస్తయి. గొర్రెపిల్లలు కోలేస్తాయి – లేగలన్నీ సిందేస్తాయ్ –

అది – నా పున్నెం కాదంటవా అయ్యా!

తవురిలాటారు, వెయ్యిమందిలో ఒకరు కొండలగిరిలేట్టూ కైతలు సేస్తారు, ఏ మారాజులో మెచ్చుకుంటారు; ఏనుగు నెక్కిస్తారు.

ఒక్కరి కూటికీ గుడ్డకూ అక్కరకొచ్చేది మీ బాస – మందిలో పడేది మా బాస –

అయ్యా, నేను తవురిలాగ నీడనూ మేడనూ బుట్టలే! వరదొచ్చి, మా అయ్య కొట్టుకొచ్చినాడు. మాయమ్మ వానకు తడిసిన జువ్వి చెట్టల్లే ఒడ్డున ఆపడింది! మెరుపుమీద మేఘం అల్లే ఒకరినొకరు కమ్ముకున్నారు. ఆకాశం నీడను సుక్కల యెలుగులో, మా యవ్వకడుపున పడ్డానయ్యా! నా సదువు నాకు మన్నెంతో మబ్బులిచ్చినాయి. యేటిహొడ్డున రెల్లుమొక్కది ఏ బాసో – నాది ఆ బాస!

'ఎవరండీ మీరు?' అని తిక్కన్నగారు తెప్పరిలి మర్యాదగా అడిగాడు. కొమ్మన్నగారు నోరు విప్పబోయినారు కాని గురునాథుడు ఉవ్వెత్తున లేచి నిలుచుని తండ్రికి నమస్కారం చేశాడు.

అయ్యా! నా కళ్ళు చల్లబడ్డాయి – నేను పోతా!

అతడిని ఆపండి నాన్నగారూ అని తిక్కన్న తహతహలాడినాడు.

నేను నిలవనని అయ్యకు తెలుసు –

మీరు – సల్లంగా వరిదిల్లండయ్యా!

తిక్కన్న మ్రాన్పడి కూర్చున్నాడు. కొమ్మన్నగారు కొడుకును సాగనంపడానికి నాలుగడుగులు వేశాడు.

ఉండవా నాయనా! నామీద కోపమా? –

అయ్యా! – నీవీమాట అంటివో, మా యవ్వ అరటి మొక్కను జ్ఞాపకం చేయమంది! నీవు ఆపైన పల్లకుంటవంది – నా బతుకు బతకాలిగంద – పోయేనయ్యా! తమ్ముడికి కూతురుడితే, మా యవ్వ పేరెట్టుకోమంది –

గురునాథుడు – పరుగున వెళ్ళిపోయాడు.

కొమ్మన్న అక్కడే నిలువబడిపోయాడు.

తిక్కన్న తండ్రిదగ్గరకు వచ్చాడు –

ఎవరు నాయనా – వారు?

మీ అన్నగారయ్యా!

ఆనాటి ముచ్చటంతా కొడుక్కి చెప్పాడు కొమ్మన్న.

తిక్కన్న చేయెత్తి గురునాథుడు వెళ్ళిన వంకనే - కనులరమోడ్చి రవంతసేపు ధ్యానముద్రలో ఉండిపోయినాడు.

నాన్నగారూ, భారత రచనకు ఫలం ఏమిటో నా కిప్పుడు అవగతమైంది. నేను వ్యాసభగవానుడికి వంకలు దిద్ది, మెరుగులు పెట్టగల మేధావినికాదూ? కవిబ్రహ్మను కాదూ? నా అహంకారం నశించడానికి దైవం యీ రూపాన వచ్చాడనుకుంటాను!

అన్నాకనే - నేనూ కవినేనా?

పంచభూతాలలో శాశ్వతంగా స్పందించే పరతత్వపు - పరాకాష్ఠ మా అన్న - పరమేశ్వర స్వరూపానికి ఉండే **అజ్ఞాత** - శాశ్వత కీర్తి ప్రతిష్ఠలే అన్నకూ ఆ భాషకు -

నాన్నగారూ, సోమయాజినై సంకల్పించాను కనుక **భారతసంహిత** పూర్తి చేస్తాను! ఆపైన గంటం ముట్టను!

అన్నాకనే - నేనూ కవినేనా?

నాదీ కవిత్వమేనా?

[ఆనందవాణి]

★ ★ ★